RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 295 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | ఆదివారం, 28 ఏప్రిల్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-




## అన్ని కులాలకు రిజర్వేషన్లు కల్పించడమే...

# కాంగ్రెస్ ధ్యేయం

### జనగణన ప్రాతిపదికన చర్యలు - సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: అన్ని కులాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ అజెండా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీసీలు 50శాతానికి పైగా ఉన్నారని, జనగణన చేసి వారికి రిజర్వేషన్లు పెంచుతామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. “ఈ దేశ రాజకీయాలను, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ప్రభావితం చేసే అంశంపై విస్పష్టంగా మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. అక్రమంగానో.. దౌర్జన్యంగానో.. 400 సీట్లు సాధించి రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలపైనే దాడి చేయాలని మోదీ, అమిత్ షా కంకణ బద్ధులై ఉన్నారు. ఇందులో భాగంగానే దేశం నలుమూలలా తిరుగుతూ అన్ని రకాల వ్యవస్థలు, సంస్థల్ని ఉపయోగించుకొని ముప్పేట దాడి చేస్తున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత భాజపాపై .. కాంగ్రెస్ స్పష్టమైన ఆరోపణలు చేస్తోంది. కాంగ్రెస్ ప్రశ్నలకు ఇప్పటి వరకు నరేంద్రమోదీ, అమిత్ షా, జేపీ నడ్డా సమాధానం చెప్పలేదు. ప్రజాస్వామ్య విలువలు, విధానాలకు విరుద్ధంగా వారు వ్యవహరిస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ మనువాద విధానాన్ని అమలు చేయాలని వారిద్దరూ ప్రయత్నిస్తున్నారు. వివిధ కులాలు, వర్గాలు ఉంటే హిందువులు ఏకతాటి మీదకురారు అనేది భాజపా కుట్ర. రిజర్వేషన్లు రద్దు చేస్తే.. వేర్వేరు కులాలు, వర్గాల ప్రస్తావన లేకుండా పోతుందనేది ఆ పార్టీ ఆలోచన. వచ్చే ఏడాదికి ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వందేళ్లు అవుతుంది. 2025 నాటికి రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు రద్దు చేయాలనేది ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం. రాజ్యాంగాన్ని మార్చాలంటే మూడింట రెండొంతుల మెజార్టీ అవసరం.

అందుకే 400 సీట్లలో గెలిపించాలని మోదీ పదే పదే కోరుతున్నారు. భారత్‌ను రిజర్వేషన్ రహిత దేశంగా మార్చాలని మోదీ, అమిత్ షా భావిస్తున్నారు” అని రేవంత్ ఆరోపించారు.

**భారాస, భాజపా కుమ్మక్కు రాజకీయాలు :** “రిజర్వేషన్ల రద్దుపై భాజపా, భారాస ఒకే విధానంతో ఉన్నాయి. ఆ రెండు పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి. మల్కాజిగిరిలో భాజపాను గెలిపిస్తామని నిన్న భారాస ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ఆయనపై కేటీఆర్ ఎందుకు చర్యలు తీసుకోలేదు. ఈటలను కేటీఆర్ ఎందుకు విమర్శించడం లేదు? ఐదు నియోజకవర్గాల్లో భాజపాకు భారాస మద్దతు ఇస్తోందని నేను చెబుతూనే ఉన్నా. అది నిజమని నిన్న మల్లారెడ్డి మాటలతో స్పష్టమైంది. పదేళ్లపాటు కేసీఆర్ భూములు అమ్ముతుంటే ఈటల రాజేందర్ ఎప్పుడైనా మాట్లాడారా? నేను రుణమాఫీ చేస్తాను అనగానే భూములు అమ్మవద్దని ఈటల కండీషన్లు పెడతున్నారు. దేశంలో రిజర్వేషన్లు కొనసాగాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలి” అని రేవంత్ విజ్ఞప్తి చేశారు.



## రాష్ట్రంలో విచిత్రమైన ఘటనలు జరుగుతున్నాయి

మహబూబ్‌నగర్: తెలంగాణలో కరెంటు పోవడం లేదని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రతి రోజూ ఊదరగొడుతున్నారని, వాస్తవ పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో తాను భోజనం చేస్తున్నప్పుడు రెండు సార్లు కరెంట్ పోయిందని ఎక్స్ (ట్విటర్) వేదికగా తెలిపారు. నియోజకవర్గాల్లో రోజుకు పదిసార్లు కరెంటు పోతోందని మాజీ ఎమ్మెల్యేలు ఆ సందర్భంగా తనతో చెప్పినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో చాలా విచిత్రమైన ఘటనలు జరుగుతున్నాయని కేసీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలని భారాస అధినేత విజ్ఞప్తి చేశారు.

# బీజేపీ దెబ్బకు.. పాత బస్తీలో కొత్త దోస్తీ!

హైదరాబాద్ : బీజేపీదెబ్బకు పాత బస్తీలో బద్ధ శత్రువులు ఏకమయ్యారా!? ఇక్కడ ఎంఐఎంకు ఎంబీటీ పరోక్ష మద్దతు ఇస్తోందా!? మజ్లిస్‌కు సహకరించడానికే పోటీ నుంచి తప్పుకుందా!? ఈ ప్రశ్నలకు ‘ఔను’ అనే అంటున్నాయి తాజా పరిణామాలు. ఈసారి హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయడం లేదని ఎంబీటీ ప్రకటించింది. మతతత్వ పార్టీలకు తాము సహకరించేది లేదని, అందుకే పోటీ నుంచి తప్పుకొంటున్నామని ఎంబీటీ నేత ఫర్హతుల్లా ప్రకటించారు.

సెక్యులర్ పార్టీకి తాము మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. తప్పితే, ఏ పార్టీకి మద్దతు ఇస్తారనే విషయాన్ని స్పష్టం చేయలేదు. అలాగే, మతతత్వ పార్టీ అని ఆయన బీజేపీని ఉద్దేశించే అన్నారా!? లేక మజ్లిస్‌ను కూడా కలిపారా!? అన్న విషయంపైనా స్పష్టత లేదు. పోటీకి దూరంగా ఉంటామని ఎంబీటీ ప్రకటించానికి కారణాలు ఏవైనా.. పరోక్షంగా ఈ పరిణామంమజ్లిస్‌కే లబ్ధి చేకూర్చనుంది.

**ముస్లిం ఓట్లు చీలకుండా..!...**ఓటమి ఎరుగని నాయకునిగా, రెండు దశాబ్దాలుగా హైదరాబాద్ ఎంపీగా ఉన్న అసదుద్దీన్ ఒవైసీకి ఈసారి ఎన్నికలు కత్తి మీద సాముగా మారాయి. బరిలోకి దిగితే విజయం ఖాయమనే ధీమా ఇప్పటి వరకూ ఉండగా.. ఈసారి పరిస్థితులు మారుతున్నాయి. ఇందుకు కారణం బీజేపీ అభ్యర్థి మాధవీలత. ఎన్నికల




నగారా మోగిన వెంటనే బీజేపీ తమ అభ్యర్థిగా మాధవీలతను ప్రకటించింది. తొలుత మజ్లిస్ వర్గాలు ఆమె పోటీని అంత సీరియస్‌గా తీసుకోలేదు. అదే సమయంలో రంజాన్ మాసం రావడంతో ప్రచారమూ ప్రారంభించలేదు. కానీ, మాధవీలత పాతబస్తీలో గల్లీ గల్లీ చుట్టేశారు. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఆమె వీడియోలే. హిందూ ఓటు బ్యాంకును ఏకం చేసే ప్రయత్నాలతోపాటు పాత నగరంలోనూ ప్రచార హోరు పెంచారు. మహిళ కావడం.. ఇంటింటికీ తిరగడం.. ఆమె ప్రచార తీరు కారణంగా కొంతమంది ముస్లిమ్ ఓటర్లు కూడా మాధవీలత వైపు మొగ్గు చూపుతున్నారన్న ప్రచారం జరిగింది. ఈ పరిణామమే మజ్లిస్ వర్గాల్లో ఆందోళనకూ కారణమైంది. ఇందుకు కారణం లేకపోలేదు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంటు స్థానంలో గత ఎన్నికలతో పోలిస్తే మజ్లిసకు దాదాపు లక్ష ఓట్లు తగ్గాయి. ముస్లిం ఓటర్లే మజ్లిసకు దూరమవుతున్నారనే సంకేతాలు ఆ ఫలితాలు వెల్లడించాయి. ఇక, యాకత్‌పుర అసెంబ్లీ సెగ్మెంట్లో అయితే మజ్లిస్, ఎంబీటీ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. కేవలం 878 ఓట్ల తేడాతో ఎంబీటీ అభ్యర్థి అంజదుల్లాఖాన్ ఓడిపోయారు.

యాకత్‌పుర పరిస్థితి పునరావృతమైతే.. మజ్లిసకు చుక్కలు కనిపించడం ఖాయం. పార్లమెంటు ఎన్నికల బరిలో మజ్లిస్, బీజేపీతోపాటు ఎంబీటీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ కూడా ఉంటాయి. కాంగ్రెస్ ముస్లిం వర్గానికే టికెట్ ఇచ్చింది. ఇక, ఎంబీటీ కూడా బరిలో ఉంటే ముస్లిం ఓట్లలో చీలిక తథ్యం. అదే జరిగితే, మజ్లిస్ కంచుకోటకు బీటలు వారడాన్ని కొట్టివేయలేం. ఈ నేపథ్యంలోనే, కొందరు మత పెద్దలు రాయబారాలు నడిపారని, ఎంబీటీని పోటీ నుంచి తప్పుకునేలా చేశారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది.




## ఖమ్మం ఖిల్లాపై ఏ జెండా ఎగరనుంది?

# సర్వత్రా ఉత్కంఠ!!

ఖమ్మం : తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో అందరి దృష్టి ఇప్పుడు ఖమ్మంపైనే ఉంది. రాష్ట్ర రాజకీయాల్లో ఖమ్మం లోక్‌సభ స్థానంకు ప్రత్యేక స్థానం ఉంది. ఖమ్మం నియోజకవర్గం తెలంగాణలోనే ఓ కీలక నియోజకవర్గంగా ఉంది. ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావు పేట స్థానాలున్నాయి. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయా పార్టీల మధ్య హోరాహోరీ పోరు జరిగింది. టీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వర రావు 2019 సార్వత్రిక ఎన్నికల్లో 1,68,062 ఓట్ల మెజార్టీతో విజయం సాధించి మొత్తంగా 5,67,459 ఓట్లు సాధించారు. నామా నాగేశ్వర రావు తన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన రేణుకా చౌదరిపై విజయం సాధించారు. రేణుకా చౌదరికి వచ్చిన ఓట్లు 3,99,397. 2019లో జరిగిన ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 75.18 % పోలింగ్ జరిగింది. అయితే ఈసారి ఇక్కడి నుంచి పోటీ చేయాలని చాలా మంది ప్రయత్నించారు. ఒక్క ఖమ్మం జిల్లాలోనే ముగ్గురు మంత్రులు ఉండడం.. ఆ మంత్రులు తమ వారికి టికెట్ ఇప్పించుకోవడం విశ్వప్రయత్నాలు చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తన భార్య నందినికి టికెట్ ఇవ్వాలని గట్టిగానే ప్రయత్నాలు చేశారు. ఒకవేళ నందినికి టికెట్ ఇవ్వని పక్షంలో కాంగ్రెస్ సీనియర్ నేత రాయల నాగేశ్వరరావుకు ఖమ్మం లోక్ సభ టికెట్ ఇవ్వాలని అధిష్టానకు సూచించారు మరోవైపు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా తమ వారికి టికెట్ ఇప్పించుకునేందుకు ప్రయత్నించారు. తన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని.. అలా లేని పక్షంలో రామసహాయం రఘురామిరెడ్డికి ఇవ్వాలని పట్టుబట్టారు. తుమ్మల నాగేశ్వరరావు కూడా తమ కుమారుడికి టికెట్ ఇప్పించుకునేందుకు కష్టపడ్డారు. అంతేకాకుండా తన కొడుకుకు ఇవ్వలేని పక్షంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు పేరును తెరపైకి తెచ్చినట్లు తెలిసింది. అయితే, కాంగ్రెస్ అధిష్టానం ప్రసాద్ రెడ్డి, రామసహాయం రఘురాం రెడ్డి, రాయల నాగేశ్వరరావు పేర్లను పరిగణలోకి తీసుకున్నట్లు, వీరిలో ఒకరి పేరును ప్రకటిస్తుందని కాంగ్రెస్ నేతలు పేర్కొంటూ వచ్చారు. ఒకే సీటుపై ముగ్గురు మంత్రులు పట్టుబడుతుండటంతో పార్టీ అధిష్టానానికి అభ్యర్థి ఎంపిక సంక్లిష్టంగా మారింది. తాజాగా, పొంగులేటి వియ్యంకుడు రామ సహాయం రఘురాంరెడ్డికే టికెట్ కేటాయించడంతో ఉత్కంఠకు తెరపడింది. ఖమ్మం లోక్?సభ స్థానానికి కాంగ్రెస్? అభ్యర్థిగా రామసహాయం రఘురామిరెడ్డిని ప్రకటించింది. రఘురామిరెడ్డి తండ్రి, కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడు సురేందర్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని డోర్నకల్ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, వరంగల్ లోక్ సభ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎంపీగా పనిచేసిన అనుభవం ఉంది.

దివంగత ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నర్సింహారావులతో వీరి కుటుంబానికి ఎంతో సాన్నిహిత్యం ఉంది. రఘురామిరెడ్డికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు వినాయక్ రెడ్డి సినీ హీరో వెంకటేశ్ పెద్ద కూతురు ఆశ్రితను వివాహం చేసుకోగా.. చిన్న కుమారుడు అర్జున్ రెడ్డి మంత్రి పొంగులేటి కుమార్తె సప్నిరెడ్డిని వివాహం చేసుకున్నారు. పొంగులేటి ప్రసాద్ రెడ్డి అభ్యర్థిత్వం ఖరారైతే ఎన్నికలు టఫ్‌గా ఉంటాయని బీఆర్ఎస్ భావించింది. పొంగులేటి ప్రసాద్ రెడ్డి కాకుండా అభ్యర్థి ఎవరైనా తామే గెలుస్తామన్న ధీమాను నామా నాగేశ్వరరావు వ్యక్త పరుస్తున్నారు. మరోసారి ఎంపీగా గెలిచి తన జిల్లాపై తన పట్టు నిలుపుకోవాలని నామా నాగేశ్వరరావు ఎత్తులు వేస్తున్నారు. ఖమ్మ సామాజిక వర్గం ఈ సారి తనకే మద్దతిస్తారని ఆయన అంచనాలు వేసుకుంటున్నారు. నియోజకవర్గంలో ఒక్క సీటు కూడా లేకున్నా 2019లో ఆయన ఎంపీగా గెలుపొందారు. ఈ సారి అదే తరహాలో జిల్లా ప్రజలు తనను ఆదరిస్తారని నామా నాగేశ్వరరావు భావిస్తున్నారట. మరోవైపు బీజేపీ నుంచి తాండ్ర వినోద్‌రావును పోటీలోకి దింపింది. కమ్యూనిస్టు ఉద్యమ కేంద్రంగా, అనేక చారిత్రక పోరాటాలకు పురిటిగడ్డగా ఉన్న ఖమ్మం.. నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కంచుకోటగా నిలిచింది. రాజకీయంగా, సామాజికంగా ఎంతో చైతన్యవంతమైన జిల్లాలో బీజేపీకి ఓట్లు ఏ మేరకు సాధిస్తోందని చూస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-జనసేన పార్టీకి వచ్చిన ఓట్లు పరిశీలిస్తే ఒక్కరికి కూడా డిపాజిట్లు దక్కని పరిస్థితి నెలకొంది. మొత్తానికి పోటీ మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ సారి ఎన్నికలు మరింత హోరాహోరీగా జరిగే అవకాశాలున్నాయి. ఖమ్మం ఖిల్లాపై ఎవరి జెండా ఎగురుతుందో చూడాలంటే జూన్ 4 వరకు ఆగక తప్పదు.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# గూగుల్ ప్రకటనల్లో ఏ పార్టీ ఖర్చు ఎంతంటే...?

ఎన్నికల సమయంలో అభ్యర్థి గుణగణాలు, సేవా ధృక్పతం, పోటీ చేస్తున్న పార్టీ... ఇవన్నీ ఒకెత్తు అయితే తాను చేసుకునే ప్రచారం మరొకెత్తు! ఒక్క మాటలో చెప్పాలంటే... ఎంత ఎక్కువ ప్రచారం చేసుకుంటే అంత ఫాలోయింగ్ పెరగడం, ఆ ఫాలోయింగ్ ఓట్లుగా మారుతుండటం జరుగుతుంటుందని అంటుంటారు. అలా అని కేవలం ప్రచారం మాత్రమే ఓట్లు తీసుకురాదు కానీ... ఓట్లు తీసుకొచ్చే విషయంలో ప్రచారం కీలక భూమిక పోషిస్తుందని మాత్రం చెప్పొచ్చు! ఈ క్రమంలో తాజాగా గూగుల్ యాడ్స్ ఖర్చులో ఏ పార్టీ ఏ ప్లేస్ లో ఉందనే విషయాలు తెరపైకి వచ్చాయి. ఇందులో భాగంగా గూగుల్ ప్రకటనలకోసం ఖర్చు చేసే పార్టీల్లో బీజేపీ అగ్రస్థానంలో ఉంది. 2023 రాష్ట్ర ఎన్నికల సమయంలో ఆ పార్టీ సుమారు రూ.19 కోట్లు కేటాయించింది. దీంతో ఈ విషయంలో టాప్ ప్లేస్ లో నిలిచింది. గత ఏడాది తొమ్మిది రాష్ట్రాల్లో జరిగిన శాసనసభ ఎన్నికల సమయంలో గూగుల్ ప్రకటనల కోసం బీజేపీ ఈ స్థాయిలో భారీగా ఖర్చు చేసింది. గూగుల్ ప్రకటనల పారదర్శక డేటా ప్రకారం 2023లో బీజేపీ రూ.19 కోట్లు ఖర్చు చేసిందని చూపిస్తుంది. దేశాన్ని పాలిస్తున్న పార్టీగా... వారు చేసిన పనులను, సాధించిన విజయాలను హైలెట్ చేస్తూ భారీ ఎత్తున ప్రకటలను ఇచ్చింది. ఈ క్రమంలో ఈ ఏడాది జరగనున్న లోక్ సభ ఎన్నికల ఖర్చును విపరీతంగా పెంచబోతుందని తెలుస్తుంది. వాస్తవానికి 2019 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ గూగుల్ రూ. 17 కోట్లు ఖర్చు చేయగా.. ఈ ఏడాది అది భారీగా పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. 2023లో జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానంగా కర్ణాటక రాష్ట్రంలో గూగుల్ ప్రకటనల కోస్సం రూ. 7.2 కోట్లు ఖర్చు చేయగా... మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తిస్ గఢ్ రాష్ట్రాల్లో గూగుల్ ప్రకటనల కోసం బీజేపీ రూ.7.71 కోట్లు ఖర్చు చేసింది. ఇదే క్రమంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం బీఆరెస్స్ పార్టీ రూ.12.1 కోట్లు ఖర్చు చేసి రెండోస్థానంలో నిలిచింది! ఇక కాంగ్రెస్ పార్టీ రూ.4.59 కోట్లు ఖర్చు చేయగా.. ఇందులో మొత్తం కర్ణాటక ఎన్నికల సమయంలోనే ఖర్చు చేసింది! మిగిలిన రాష్ట్రాల్లో అతితక్కువగా ఖర్చు చేసింది. ఇక ఈ ఏడాది జనవరి 1 నుంచి మార్చి 3 వరకూ తెలంగాణలో రూ.2.6 కోట్ల ప్రకటనలు రాగా... అందులో బీజేపీ రూ.1.1 కోట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... సీబీసీ రూ. 50 లక్షలు, ఐప్యాక్ రూ.60 లక్షలు, టీడీపీ రూ.13 లక్షలు ఖర్చు చేశాయి. ఇక ఏపీ విషయానికొస్తే... ఇక్కడ 4.2 కోట్ల రూపాయల ప్రకటనలు రాగా వాటిలో ఐప్యాక్ రూ. 2.5 కోట్లు, బీజేపీ రూ.65 లక్షలు, సీబీసీ రూ.63 లక్షలు, టీడీపీ రూ.13 లక్షలు, వైసీపీ రూ.11 లక్షలు ఖర్చు చేశాయి. ఈ క్రమంలో ఓవరాల్ గా దేశవ్యాప్తంగా బీజేపీ సుమారు రూ.30 కోట్లను ఈ ప్రకటనల కోసం ఖర్చు చేసినట్లు తెలుస్తుంది.

# విద్యా వికాసానికి పీఎంశ్రీ



చేగుంట: పాఠశాలలకు నిధులు లేకపోవడంతో సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉంటాయి. ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో ఉన్నప్పటికీ విద్యార్థులు చదువుకునేందుకు గదుల కొరత, తాగేందుకు నీటి సౌకర్యం ఉండదు. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు..మన బడి' కార్యక్రమంలో పాఠశాలలను అభివృద్ధి చేస్తోంది. ఇదే తరహాలో కేంద్ర ప్రభుత్వం కూడా 'ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా'(పీఎంశ్రీ) పేరుతో కొత్త పథకానికి గత ఏడాది శ్రీకారం చుట్టింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండో విడత 11 పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేశారు. యూడైస్ ప్లస్ ప్రోగ్రాంలో నమోదైన సమాచారం ప్రకారం జిల్లాల వారిగా పీఎంశ్రీ పథకానికి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 60 రకాల ప్రశ్నావళిని పూరించారు. పాఠశాల ఫొటోలు, పంచాయతీ, పాఠశాల తీర్మాన ప్రతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. సొంత భవనం, అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ, విద్యార్థుల నమోదు, శౌచాలయాలు, తాగునీరు, చేతుల శుభ్రత, సరిపడే సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యుత్తు, గ్రంథాలయ వసతి వంటి అంశాలను అందులో నింపారు. దాని ఆధారంగా మొదటి విడతలో జిల్లాలో 20 పాఠశాలలను ఎంపిక చేశారు. తాజాగా రెండో విడతలో 11 పాఠశాలలను ఎంపిక చేశారు.

రూ.లక్షల్లో నిధులు: ఎంపికైన పాఠశాలలకు నాలుగేళ్లలో రూ.లక్షల్లో నిధులు విడుదలకానున్నాయి. ఇందులో కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం నిధులు అందిస్తుంది. ఈ నిధులతో పోషకాహారవనం, శుద్ధి జలం, సౌర విద్యుత్తు, ప్రయోగశాలలు, అంతర్జాల సదుపాయం, డిజిటల్ బోధన, వృత్తివిద్యా కోర్సులు, ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దటం, డిజిటల్ గ్రంథాలయం, క్రీడా మైదానం, నైపుణ్యాభివృద్ధి పెంపునకు చర్యలు తీసుకోనున్నారు. పాఠశాల దశ నుంచే ఒకేషనల్ కోర్సులను ప్రోత్సహిస్తారు. విద్యార్థి డిగ్రీకి వచ్చే సరికి ఏదో ఒక రంగంలో ఉపాధి పొందేలా తీర్చిదిద్దాలని జాతీయ విద్యావిధానం లక్ష్యం.

కొన్ని పాఠశాలలే: పీఎంశ్రీ కింద పాఠశాలలను ఎంపిక చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని అప్పట్లో సూచించారు. ప్రతి మండలం నుంచి రెండు పాఠశాలలను ఎంపిక చేస్తామని ప్రకటించారు. తీరా మొదటి విడతలో కొన్ని, ఇప్పుడు మరికొన్ని ఎంపిక చేశారు. మండలానికి రెండు పాఠశాలలు ఎంపికవుతాయని ఉపాధ్యాయులు, గ్రామస్థులు భావించారు. కానీ కొన్ని మండలాల్లోని బడులకు ప్రాతినిధ్యం దక్కలేదు.

జిల్లాలో ఎంపికైనవి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంట, టీఎన్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ మెదక్, జడ్పీ ఉన్నత పాఠశాల చిన్నశంకరంపేట, జడ్పీ ఉన్నత పాఠశాల కూచన్‌పల్లి(హవేలిఘనపూర్), జడ్పీ ఉన్నత పాఠశాల లింగాయిపల్లి-చీకోడ్(పాపన్నపేట), జడ్పీ ఉన్నత పాఠశాల గోమారం(శివ్వంపేట), జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నర్సాపూర్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పెద్దశంకరంపేట, కేజీబీవీ కొల్చారం, ప్రాథమికోన్నత పాఠశాల నర్సంపల్లి(నార్సింగి), జడ్పీ ఉన్నత పాఠశాల కౌడిపల్లి.

పాఠశాల అభివృద్ధికి మేలు రాధాకిషన్, డీఈవో

జిల్లాలో రెండో విడత మరికొన్ని పాఠశాలలను పీఎంశ్రీ కింద ఎంపిక చేశారు. దీనివల్ల పాఠశాలల్లో మరిన్ని సౌకర్యాలు లభించనున్నాయి. ఏటా కొన్ని పాఠశాలలను ఎంపిక చేస్తున్నారు. ఎంపిక చేసిన వాటికి త్వరలోనే నిధులు విడుదల అవుతాయి. వాటితో ఎన్నో పనులు చేసేందుకు ఆస్కారం ఉంటుంది.

# కాస్త మెరుగు..



మెదక్ : ఇంటర్ ఫలితాలు ఈసారి కాస్త ఊరటనిచ్చాయి. గత కొన్నేళ్లుగా అట్టడుగు స్థానంలో ఉంటున్న జిల్లా ఈసారి కాసింత మెరుగైన ఫలితాలు సాధించింది. గత విద్యాసంవత్సరంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాల్లో 33వ స్థానంలో నిలవగా.. 2023-24 విద్యాసంవత్సరంలో ప్రథమ సంవత్సరంలో 28వ స్థానం, ద్వితీయలో 31వ స్థానంలో నిలిచింది. వరుసగా చివరి స్థానంలో నిలుస్తుండటంతో ఇది వరకు పనిచేసిన పాలనాధికారి రాజర్షిషా ఫలితాల మెరుగు కోసం ప్రత్యేక శ్రద్ధ వహించారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షలు నిర్వహించడంతో ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఫలితాల్లో కొంత మార్పు కనిపించింది.

ఈసారి సత్తా....: గత సంవత్సరం మాదిరిగానే ఈసారి సైతం ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. ప్రథమలో 5,905 మంది పరీక్షలు రాయగా 2,786 మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 3,119 మంది ఫెయిల్ కావడం గమనార్హం. అంటే సగం మంది కూడా ఉత్తీర్ణత సాధించలేదు. 3,257 మంది బాలికలు పరీక్షలు రాయగా వారిలో 1,759 మంది(54.01శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురలో 2,648 మందికి 1,027 మంది(38.78 శాతం) మాత్రమే పాసయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 5,295 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3,044 మంది ఉత్తీర్ణులయ్యారు. 2,251 మంది అనుత్తీర్ణులయ్యారు. 3,004 మంది బాలికలు పరీక్షలు రాయగా 1,945 మంది(64.75శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురలో 2,291 మంది పరీక్షలు రాస్తే 1,099(47.97 శాతం) మాత్రమే ఉత్తీర్ణత సాధించారు.

ఊరటనిచ్చిన ఒకేషనల్: జనరల్ విభాగానికి చెందిన ఫలితాలు ఏటా నిరాశపరుస్తుండగా.. ఈసారి ఒకేషన్ విభాగం ఫలితాలు ఊరటనిచ్చాయి. ప్రథమ సంవత్సరంలో 602 మందికి 421 మంది ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం 528 మందికి 383 మంది ఉత్తీర్ణులై 72.54 శాతంతో రాష్ట్రంలో 6వ స్థానంలో నిలిచింది.

ఫలితాలు ఇలా...: జిల్లా వ్యాప్తంగా ఉన్న 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చిన్నశంకరంపేట కళాశాలలో అత్యధికంగా 96.30శాతం, అత్యల్పంగా తూప్రాన్ కళాశాలలో 15.29 శాతం ఫలితాలు వచ్చాయి. ఆరు కస్తూర్బా కళాశాలల్లో అత్యధికంగా అల్లాదుర్గంలో 94.44 శాతం, మెదక్‌లో 42.11 శాతం ఫలితాలు సాధించారు. 20 గురుకుల కళాశాలలో అత్యధికంగా టీఎస్ఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ కొల్చారం, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌జేసీ(బాలుర) కౌడిపల్లిలో శతశాతం ఫలితాలు సాధించడం గమనార్హం. అత్యల్పంగా హవేలిఘనపూర్‌లోని మహాత్మ జ్యోతిబాపులే కళాశాలలో 56.67 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏడు ఆదర్శ జూనియర్ కళాశాలలో అత్యధికంగా చిన్నశంకరంపేటలో 99.12 శాతం, అత్యల్పంగా పెద్దశంకరంపేట కళాశాలలో కేవలం 25.44 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు లేకపోవడం, ఇంటి వద్ద పనుల కారణంగా విద్యార్థుల హాజరుశాతం తగ్గుతోంది. వాట్సప్ గ్రూపులు ఏర్పాటుచేసి, స్టడీ మెటీరియల్ అందజేసినా ఫలితాల్లో వెనకబడ్డారు.

ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేవు
- సత్యనారాయణ, జిల్లా ఇంటర్ అధికారి


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసినా, ప్రత్యేక తరగతులు నిర్వహించినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేవు. కానీ గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఫలితాల్లో కాస్త మెరుగుపడ్డాం. స్టడీ మెటీరియల్ ఇవ్వడం ఆలస్యం కావడంతో కొంత ప్రభావం చూపింది. వచ్చే విద్యాసంవత్సరం ఆరంభం నుంచే ప్రత్యేక తరగతులను నిర్వహించి, స్టడీ మెటీరియల్‌ను అందజేస్తాం. మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం.

పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రిత్విక్ 953(ఎంపీసీ), తెలంగాణ మైనార్టీ గురుకులంలో ఎంపీసీలో బి.నందిని 966, ఎం.నందిని 966, లహరి 965, సంధ్య 951, జ్యోతి 930, బైపీసీలో లహరిక 941, యాసీన్‌బీ 929 మార్కులు సాధించారు. ప్రథమ ఎంపీసీలో తేజస్విని 448, స్వర్ణదీపిక 432, సానియా సుల్తానా 425, బైసీపీలో సోఫియా 424, కీర్తన 419 మార్కులు సాధించారు. చేగుంట: తెలంగాణ ఆదర్శ పాఠశాలలో బైపీసీలో మనీషాగుప్తాకు 943 మార్కులు వచ్చాయి.

# గ్రేటర్ నాడి పట్టేదెలా?

హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికలకు సరిగ్గా 20 రోజులే ఉంది. గ్రేటర్‌లో ఓటరు నాడి అంతుచిక్కకుండా ఉంది. పార్టీ తరఫున ఎలక్షనీరింగ్ చేస్తున్న సంస్థలు ఐవీఆర్‌ఎస్ ద్వారా సర్వే చేస్తున్నాయి. మీ లోక్‌సభ పరిధిలో ఏ పార్టీ గెలుస్తుందని భావిస్తున్నారని ఫోన్ ద్వారా అడుగుతున్నారు. ఇక పార్టీ అభ్యర్థులు ఫోన్‌లో ఐవీఆర్‌ఎస్ కాల్ ద్వారా ఓటర్లను పరిచయం చేసుకుంటున్నారు. ఓటేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. కొద్దిరోజులుగా నిత్యం నగరంలో ఓటర్లకు రెండుమూడు ఫోన్‌కాల్స్ ఈతరహావే వస్తున్నాయి. సిటీ పరిధిలో 4 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరితో పాటూ చేవెళ్ల స్థానాలకు మే 13న పోలింగ్ జరగనుంది. సమయం దగ్గరపడుతున్నా మూడు స్థానాల్లో ఓటరు నాడి తెలుసుకోవడం అభ్యర్థులకు క్లిష్టంగానే ఉంది. సిటీ 'మూడు'ను తెలుసుకునేందుకు ప్రధాన పార్టీలు..సర్వే ఏజెన్సీలను నియమించుకుని ఎప్పటికప్పుడు వారితో ఓటర్ల మొగ్గు ఎటుందో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఐవీఆర్‌ఎస్ కాల్స్ చేస్తున్నారు. గత ఎన్నికల్లో అనూహ్యంగా...

2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నాలుగు లోక్‌సభ స్థానాలను ఒక్కో పార్టీ చొప్పున ఓటర్లు పట్టం కట్టారు. అంతకు ఐదు నెలల ముందు జరిగిన అసెంబ్లీ ఫలితాలకు భిన్నంగా తీర్పు ఇచ్చారు. భారాస, భాజపా, కాంగ్రెస్, ఎంఐఎంను ఒక్కో స్థానంలో గెలిపించారు. ఈ సారి సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ స్థానాల్లో త్రిముఖ పోరు నెలకొంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో సిటీలో అత్యధిక స్థానాలను భారాస గెల్చుకుంది. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో భాజపా అధికారంలో ఉన్నాయి. ఓటరు మొగ్గు ఎటో క్షేత్రస్థాయిలో స్పష్టత రావాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే అని రాజకీయ వర్గాలంటున్నాయి.



# విచ్చలవిడిగా బోర్ల తవ్వకం

గజ్వేల్: పర్యావరణాన్ని కాపాడి, భూగర్భ జలమట్టాలు పడిపోకుండా తీసుకునే జాగ్రత్తల్లో భాగంగా ప్రభుత్వం వాల్టా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ నిబంధనల ప్రకారం అనుమతి లేనిదే ఇసుక తీయకూడదు, బోర్లు తవ్వకూడదు. ఒకవేళ తప్పని పరిస్థితి వస్తే బోరు బావికి కనీసం 100 మీటర్ల దూరంలో మాత్రమే కొత్త బోరు వేయాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ జిల్లాలో పరిస్థితి చూస్తే వాల్టా చట్టం ఉందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఎందుకంటే వాగుల్లో ఇసుక తీయటం ఆగటం లేదు. విచ్చలవిడిగా బోర్లు తవ్వకం నిలవడం లేదు.

మరింత లోతుకు తవ్వి : పంటలు ఎండిపోతున్నాయనే కారణంగా రైతులు బోర్లు వేస్తుండగా, ఇళ్ల నిర్మాణాల కోసం యజమానులు, వెంచర్లు, స్థిరాస్తి వ్యాపారం చేసేందుకు రియల్టర్లు ఇష్టారీతిన బోర్లు తవ్వుతున్నారు. జిల్లాలో రోజుకు పాతిక సంఖ్యలో బోర్లు వేస్తున్నారు. ఇసుక తీయటం, బోర్లు వేయటం కారణంగా వాతావరణ సమతుల్యం దెబ్బతిని అనర్థాలకు దారి తీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగిలో దాదాపు 3 లక్షల ఎకరాల మేర వరి పంట సాగైంది. ప్రస్తుతం వరి పంట గొలుసు కట్టి గింజ పాలు



తాగుతోంది. ఈ దశలో అధికంగా నీటి అవసరం ఉండటంతో భూగర్భనీటి మట్టం తగ్గిపోయి చాలా చోట్ల బోర్లు తట్టి పోస్తున్నాయి. కొన్నిచోట్ల పూర్తిగా ఎండిపోవడంతో రైతులు మళ్లీ కొత్తగా బోరు బావులు తవ్వుతున్నారు. కొన్నిచోట్ల పాత వాటిని మరింత లోతుకు తవ్విస్తున్నారు.సంఖ్య భారీగా పెరిగి.. : జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల పురపాలికలతో పాటు మండల కేంద్రాల్లో జోరుగా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. ప్రతి ఇంటికి కొత్తగా బోరు వేసిన తరువాతనే పనులు ప్రారంభిస్తున్నారు. వెంచర్లు ఏర్పాటు చేస్తున్న రియల్టర్లు రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణంతోపాటు వెంచర్లలో అభివృద్ధి పనుల కోసం బోర్లు తవ్విస్తున్నారు. ఫలితంగా జిల్లాలో బోర్ల సంఖ్య భారీగా పెరిగిపోతోంది. జిల్లాలో సాగు కోసం దాదాపు 160 లక్షల బోర్లు వినియోగంలో ఉన్నట్లు అంచనా. ఇటీవల కొత్తగా సుమారు వేయి వరకు బోర్లు తవ్వించినట్లు అంచనా. ఇళ్లలోని బోర్లు పరిశీలిస్తే బల్దియాల్లోనే 1 లక్షకు పైగా వినియోగిస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. దీనికి తోడు నెలకు సుమారు 150 వరకు కొత్త బోర్లు వేస్తున్నట్లు తెలుస్తుంది. ఇలా ఇష్టారీతిన బోర్లు వేయటం వల్ల రానున్న రోజుల్లో మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

# ఆట.. అటకెక్కినట్టే!

మెదక్ : గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీసేందుకు.. వారు సాధన చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ప్రతి పంచాయతీ, పురపాలికల్లోని వార్డులో వీటిని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. అయితే చాలా చోట్ల గ్రామాలకు దూరంగా, ఖాళీ స్థలాల్లో బోర్డులను ఏర్పాటు చేసి మమ అన్పించారు. ఫలితంగా కోట్లాది రూపాయలు బూడిదలో పోసిన పన్నీరైంది.

తూతు మంత్రంగా...: పాపన్నపేట మండలంలో 35 పంచాయతీల్లో మైదానాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో బోర్డుతో పాటు వ్యాయామం చేసేందుకు సింగిల్ బార్, డబుల్ బార్ ఏర్పాటు చేశారు. స్థలం తక్కువ ఉన్న చోట్ల వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేశారు. పాపన్నపేట, యూసుఫ్‌పేట, మిన్‌పూర్, దౌలాపూర్ గ్రామాల్లో పాఠశాల ఆవరణలో వీటిని ఏర్పాటు చేశారు. చాలా చోట్ల అనువుగాని ప్రాంతంలో ఉండడంతో నిరుపయోగంగా మారాయి.పరికరాలు లేక..: తూప్రాన్ మండలంలో 14 గ్రామాల్లో ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల స్థలాలు సరిపడా లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాల, ఇతర ఖాళీ స్థలాల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. ఎక్కడా పరికరాల ఏర్పాటు చేయలేదు. చాలా చోట్ల సూచిక బోర్డులు, రెండు ఇనుప పైపులను బిగించి వదిలేశారు. మల్కాపూర్, వట్టూర్‌ల్లో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బోర్డులను ఏర్పాటు చేసి వదిలేశారు. వెంకటాయపల్లి శివారులో లోతట్టు ప్రాంతంలో, కిష్టాపూర్‌లో గ్రామానికి దూరంగా బోర్డు ఏర్పాటు చేశారు.పొదల మధ్య..: చేగుంట మండలం మక్కరాజుపేటలో ఊరికి దూరంగా ఏర్పాటు చేశారు. అందులో రాళ్లు ముళ్ల పొదలే ఉన్నాయి. పరికరాలను పంపిణీ చేసినా, అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. పులిమామిడి, రుక్మాపూర్‌లో గ్రాంలోనే కేవలం గుంట విస్తీర్ణంలో మాత్రమే ఏర్పాటు చేశారు. ఆటలు ఆడే సౌకర్యంలేదు. చేగుంట, నార్సింగి మండలాల్లో చాలా చోట్ల పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసినా ఉపయోగంలో లేవు.

కుంటలో..: టేక్మాల్ మండల పరిధి కోరంపల్లిలో కుంటలో ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో నీళ్లు నిలిచి ఉంటాయి.

దీంతో వినియోగంలోకి రావడం లేదు. బోర్డు మాత్రమే ఏర్పాటు చేయగా, పరికరాలను బిగించలేదు. పెద్దశంకరంపేట మండలం రామోజీపల్లిలో అనువుగా లేని ప్రాంతంలో ఏర్పాటు చేశారు.

అసంపూర్తిగా..: మెదక్ పట్టణం 32 వార్డుల్లో ఏర్పాటు చేయాలి. కేవలం 12చోట్ల ఏర్పాటు చేశారు. ఇందులో పూర్తిస్థాయిలో ఎనిమిది ఉండగా, మిగిలినవి అసంపూర్తిగా ఉన్నాయి. మిగతా వార్డుల్లో స్థలం లేకపోవడంతో ఏర్పాటు చేయడం లేదు. ప్రస్తుతం ఉన్న ప్రాంగణాలకు పరికరాలు అందజేశారు.

గ్రామాలకు దూరంగా...: కౌడిపల్లి, రామాయంపేట, నిజాంపేట మండలాల్లో చాలా వరకు ఊరికి దూరంగా ఏర్పాటు చేయడం వల్ల నిరుపయోగంగా ఉన్నాయి. వాటిలో ధాన్యం ఆరబెడుతున్నారు. హవేలిఘనపూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో అదే పరిస్థితి. ఇక్కడా ధాన్యం ఆరబోశారు. మాసాయిపేట మండలం నాగ్సానపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

నిర్వహణపై ఆదేశాలు లేవు:ప్రాంగణాల నిర్వహణపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆటల కిట్లు రావడంతో అన్ని మండలాలు, మున్సిపాలిటీలకు వాటిని పంపిణీ చేశాం. ప్రాంగణాలు ఉన్న చోట కిట్ ఇవ్వాలని గతంలో చెప్పారు .నాగరాజు, జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి

# గ్రామాల్లో ప్రచార హోరు!

తాండూరు : పార్లమెంటు ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో జిల్లాలో జాతీయ పార్టీలు ప్రచారంలో జోరు పెంచాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, భాజపాలు మారుమూల గ్రామాల్లో సైతం ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్నాయి. మరోవైపు భారాస ఇప్పటివరకు వేగం పెంచకున్నా ఇకముందు కార్యాచరణకు పావులు కదుపుతోంది. ఎమ్మెల్యేలు, కార్యకర్తలతో కలిసి నడుస్తూ..

జిల్లాలోని కొడంగల్ మినహా తాండూరు, వికారాబాద్, పరిగి నియోజకవర్గాలు చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో కొనసాగుతున్నాయి. కొడంగల్ మహబూబ్‌నగర్ పరిధిలో ఉంది. వీరంతా మే 13న ఓటు వేసి ఎంపీ అభ్యర్థిని ఎన్నుకోనున్నారు. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎంపీ రంజిత్‌రెడ్డిని ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. రెండు రోజుల క్రితం బషీరాబాద్, పెద్దేముల్ మండలాల్లో 30కిపైగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించి ఓట్లను అభ్యర్థించారు.

ఎంపీకి మద్దతుగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తాండూరు మండలంలోని పదమూడు గ్రామాల్లో ఉదయం నుంచి రాత్రి దాకా ప్రచారం చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంతో నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. తాజాగా ఎంపీ ఎన్నికల ప్రచారంలో అదే జోరుతో శ్రేణులు కాంగ్రెస్ జెండాల్ని



ప్రదర్శిస్తూ గ్రామాల్లో రోడ్‌షోలు, డప్పుల మోతతో ర్యాలీలు, బాణసంచాతో సందడి చేస్తున్నారు.

చాపకింద నీరులా భాజపా


కాంగ్రెస్‌కు దీటుగా భాజపా సైతం గ్రామాల్లో ప్రచారం కొనసాగిస్తోంది. ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరచూ తాండూరు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. కల్యాణ మండపాల్లో కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ బూత్ స్థాయిలో ఓట్లను పొందేందుకు దిశానిర్దేశనం చేస్తున్నారు. తాండూరు, బషీరాబాద్, యాలాల మండలాల్లో యాభైకిపైగా గ్రామాల్లో ప్రచారం చేశారు. పట్టణాధ్యక్షులు నాగారంమల్లేశం అధ్వర్యంలో ఏకంగా ఇంటింటి ప్రచారం సైతం కొనసాగిస్తూ భాజపా పట్టు సాధించేలా కృషి చేస్తున్నారు.

నాయకులకు భారాస మార్గనిర్దేశం

భారాస పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ఇటీవలే నామినేషన్ వేశారు. వారం క్రితం ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలు కల్యాణ మండపంలో భారాస నాయకులతో సమావేశం నిర్వహించి మార్గనిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రచారాన్ని వేగవంతం చేయడానికి సూచనలు అందించారు.

# తపాలా ఓటుకు చకచకా ఏర్పాట్లు


హైదరాబాద్: ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి తపాలా ఓటు సౌకర్యాన్ని కల్పించే ప్రక్రియను జీహెచ్‌ఎంసీ విస్తృతంగా నిర్వహించింది. వేర్వేరు శాఖల నుంచి సుమారు 40 వేల మంది అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొంటుండగా, ఆయా శాఖలన్నింటికీ ఫారం-12ను చేరవేశామని అధికారులు వెల్లడించారు. సంబంధిత అధికారులు, సిబ్బంది వివరాలు నింపిన దరఖాస్తులను సమర్పించే గడువు ముగిసిందని తెలిపారు. ఎన్ని దరఖాస్తులొచ్చాయో లెక్క తేల్చి, వాటిని సంబంధిత నియోజకవర్గం రిటర్నింగ్ అధికారులకు




చేరవేస్తామని ఎన్నికల అధికారులు వివరించారు.

ఎలా వేస్తారంటే..

ఎన్నికల విధుల్లోని సిబ్బంది ఫారం-12ను సమర్పించి తపాలా ఓటు సదుపాయాన్ని పొందవచ్చు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటయ్యే ఫెసిలిటేషన్ కేంద్రాల్లో మే 3నుంచి 8వ తేదీలోపు వారు ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఎంపీ అభ్యర్థుల తుది జాబితాపై ఈనెల 29న స్పష్టత రానుండగా, అనంతరం రిటర్నింగ్ అధికారులు నియోజకవర్గాల బ్యాలెట్ పేపరు ముద్రిస్తారు. తపాలా ఓటు ప్రక్రియ దాని ఆధారంగానే జరగనున్న విషయం తెలిసిందే. ఒకవేళ.. నల్గొండ జిల్లాలో ఓటు హక్కు కలిగిన ఉద్యోగి హైదరాబాద్ పార్లమెంటు పరిధిలో ఎన్నికల విధుల్లో ఉంటే హైదరాబాద్‌లోని ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు వేయాలా? నల్గొండ వెళ్లి ఓటు వేయాలా? అనే అంశాన్ని ముందుగానే ఫారం-12లో పేర్కొనాల్సి ఉంటుంది. ఆమేరకు సంబంధిత ఆర్వో తపాలా ఓటు కోరిన ఉద్యోగుల ఓటరు జాబితాను రూపొందించి ఫెసిలిటేషన్ కేంద్రం రిజిస్టర్‌లో పేరు చేరుస్తారు. ఈ ప్రక్రియకు నగరంలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయని, వృద్ధులకు ఇంటివద్ద ఓటువేసే సదుపాయాన్ని కూడా కట్టుదిట్టంగా నిర్వర్తిస్తున్నామని అధికారులు తెలిపారు.




# 30 నామినేషన్ల తిరస్కరణ.. హైదరాబాద్‌లో 19, సికింద్రాబాద్‌లో 11

హైదరాబాద్ సిటీ: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన ముగిసింది. పలు కారణాలతో రెండు పార్లమెంట్‌ల పరిధిలో 30 నామినేషన్లను తిరస్కరించినట్టు అధికారులు తెలిపారు. మల్కాజిగిరి సెగ్మెంట్‌లో అత్యధికంగా 77 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. హైదరాబాద్ పార్లమెంట్‌కు 57 మంది నామినేషన్లు దాఖలు చేయగా 19 మంది నామినేషన్లను తిరస్కరించారు. 38 మంది నామినేషన్లను ఆమోదించారు. సికింద్రాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి 57 మంది నామినేషన్లు వేయగా.. 11 పత్రాలను తిరస్కరించారు. 46 నామినేషన్లు ఆమోదం పొందాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలు సమర్పించని నామినేషన్లను తిరస్కరించినట్టు చెప్పారు. ఏ కారణంతో నామినేషన్లు తిరస్కరించామన్న వివరాలను సంబంధిత అభ్యర్థులకు అందజేస్తామన్నారు. తిరస్కరణకు గురైన అభ్యర్థులు డిపాజిట్ అమౌంట్‌ను తిరిగి ఇస్తామన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు 29 వరకు గడువు ఉంది.

**చేవెళ్లలో 17 నామినేషన్ల తిరస్కరణ :** చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో సరైన ఫార్మాట్‌లో లేని నామినేషన్లను తిరస్కరించారు. మొత్తం 64 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీటిలో అధికారులు 17 నామినేషన్లను తిరస్కరించారు. మిగిలిన 47 నామినేషన్లకు జిల్లా ఎన్నికల అధికారి శశాంక అమోదం తెలిపారు.

**మల్కాజిగిరిలో..** మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి 114 మంది అభ్యర్థులు 177 నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతం ఆధ్వర్యంలో జరిగిన స్క్రూటినీలో 77 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 37 మంది అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే ఆమోదించినట్లు ఎన్నికల పరిశీలకులు డాక్టర్ రాజీవ్ శుక్లా తెలిపారు.

# మళ్లీ వెనక బాటే!



సంగారెడ్డి : ఇంటర్ ఫలితాల్లో ఎప్పటిలాగే అమ్మాయిల హవా కొనసాగింది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. గతేడాదితో పోల్చితే ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గింది. గత విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం 57 కాగా.. ఈసారి 55.29కి పడిపోయింది. రాష్ట్రస్థాయిలో గతేడాది 17వ స్థానంలో ఉండగా ఈసారి 18వ స్థానంలో జిల్లా నిలిచింది. ద్వితీయ సంవత్సరంలో గతేడాది 66శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా ఈ సంవత్సరం 65.57 శాతం ఉత్తీర్ణత నమోదయింది. గత సంవత్సరం రాష్ట్రంలో 15వ స్థానంలో ఉండగా ఈసారీ అదే స్థానం దక్కింది.

బాలికలే అధికం..: ప్రథమ సంవత్సరం పరీక్షకు 15,989 మంది విద్యార్థులు హాజరుకాగా 8,840 మంది విద్యార్థులు పాసయ్యారు. ఉత్తీర్ణులైన వారిలో బాలికల శాతం ఎక్కువగా ఉంది. 6,837 మంది బాలురకు 2,848 మంది, బాలికల్లో 9,152 మందికి 5,992 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలుర ఉత్తీర్ణత శాతం 41.66 కాగా.. బాలికల ఉత్తీర్ణత శాతం 65.47 ఉండటం విశేషం. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 15,273 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 10,014 మంది గట్టెక్కారు. పరీక్ష రాసిన వారిలో బాలురు 6,228 మందికి 3,375 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 9,045 మందికి 6,639 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర ఉత్తీర్ణత శాతం 54 ఉండగా బాలికల ఉత్తీర్ణత 73.40 శాతంగా ఉంది.

వృత్తివిద్యలో..: ఒకేషనల్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 1,681 మంది హాజరుకాగా 912 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 695 మంది పరీక్ష రాయగా 269 మంది, బాలికలు 986కు 643 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలుర ఉత్తీర్ణత శాతం 38.71 ఉండగా బాలికల ఉత్తీర్ణత శాతం 65.21గా ఉంది. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,321 మంది హాజరుకాగా 887 మంది గట్టెక్కారు. బాలురు 496కు 257, బాలికలు 825కి 630 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలుర ఉత్తీర్ణత శాతం 51.81 ఉండగా బాలికల ఉత్తీర్ణత 76.36శాతం ఉండటం విశేషం.

బీసీ గురుకులాల్లో 89.38 శాతం: మహాత్మా జ్యోతిబా ఫులే బీసీ గురుకుల కళాశాలల్లో 292 మంది విద్యార్థులకు 261 మంది ఉత్తీర్ణులై 89.38 శాతం సాధించారు. అత్యధికంగా జోగిపేటలో 77కి 70 పాసయ్యారు. అత్యల్పంగా ఝరాసంగంలో 48 మందికి 41 ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 483 మందికి 359 విద్యార్థులు ఉత్తీర్ణులై 74.33 శాతం సాధించారు. అత్యధికంగా జోగిపేటలో 69 మందికి 22 మంది పాసయ్యారు.

సత్తాచాటిన రంజోల్ విద్యార్థులు: ఇంటర్ ఫలితాల్లో జహీరాబాద్ మండలం రంజోల్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థినులు.. శిరీష 990, పింకీ 982 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో 111 మంది పరీక్ష రాయగా 89 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 113 మందికి 96 మంది పాసయ్యారు.

ఖేడ్ ప్రభుత్వ కళాశాలకు రాష్ట్ర ర్యాంకులు

ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మెరిశారు. ప్రథమ సంవత్సరానికి సబంధించి బైపీసీ విభాగంలో బైజా సభా 440 మార్కులకు 437 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు సాధించింది. సాయివాణి 434 మార్కులతో రాష్ట్ర స్థాయి నాలుగో ర్యాంకు, ఎంపీసీ విభాగంలో అక్షయ రాథోడ్ 465 మార్కులతో రాష్ట్ర స్థాయి మూడో ర్యాంకు, వడ్ల స్నేహ 460 మార్కులతో రాష్ట్ర స్థాయి 11వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ కళింగ కృష్ణ కుమార్ తెలిపారు.

సాంఘిక సంక్షేమ గురుకులాల్లో..

సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు సంబంధించి.. జిల్లాలో ఇంటర్మీడియట్‌లో 800 మందికి 672 మంది ఉత్తీర్ణులై 84 శాతం సాధించారు. ఇందులో కొండాపూర్‌లో 59మందికి 59, న్యాల్‌కల్‌లో 12కి 12 ఉత్తీర్ణులై శతశాతం ఫలితాలు సాధించాయి. అత్యల్పంగా నారాయణఖేడ్‌లో 35కి 17 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ కళాశాలల్లో ప్రథమ సంవత్సరానికి సంబంధించి.. 857 మందికి 639 మంది ఉత్తీర్ణులై 75 శాతం సాధించారు. కొండాపూర్‌లో 76కి 76 మంది ఉత్తీర్ణులై వంద శాతం ఫలితాలు వచ్చాయి. అత్యల్పంగా నారాయణఖేడ్‌లో 70కి 30 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఆదర్శ కళాశాలలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో 979కి 340 మంది ఉత్తీర్ణతతో 35 శాతం, ద్వితీయ సంవత్సరంలో 973కి 544 మంది ఉత్తీర్ణతతో 56 శాతం సాధించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను డీఈవో వెంకటేశ్వర్లు అభినందించారు. మునిపల్లి ఆదర్శ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థిని తెహ్రీన్ బైపీసీలో 934 మార్కులు, సీఈసీలో మనీషా 918 మార్కులు సాధించారు.

ఆదర్శ కళాశాలలు..

కస్తూర్బాల్లో..ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జిల్లాలోని కస్తూర్బాలకు చెందిన 432 మందికి 320 మంది విద్యార్థినులు (74.07 శాతం) ఉత్తీర్ణులయ్యారు. అత్యధికంగా అందోలులో 74కి 60, అత్యల్పంగా కొండాపూర్‌లో 49కి 38 పాసయ్యారు. కస్తూర్బాల్లో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 512 మందికి 333 మంది(65.04 శాతం) ఉత్తీర్ణులయ్యారు. అత్యధికంగా కొండాపూర్‌లో 67కి 58 మంది, అత్యల్పంగా 63కి 29 మంది పాసయ్యారు. ఝరాసంగంలో కస్తూర్బా విద్యార్థినులు సింధు (ఎంపీసీ, 954), బైపీసీలో మౌనిక(981), శ్వేత(981) మార్కులు సాధించారు. కల్హేర్ కస్తూర్బాలో బైపీసీ విద్యార్థిని పి.భాగ్యశ్రీ 969 మార్కులతో ప్రతిభ చూపారని సంబంధిత అధికారులు తెలిపారు.

# తెలంగాణ వయా కర్ణాటక

జహీరాబాద్.. 1956 నవంబరు 1 వరకు హైదరాబాద్ రాష్ట్రంలోనే కొనసాగింది. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో ఈ ప్రాంతంలోని కొన్ని పట్టణాలు, గ్రామాలు కర్ణాటక, మహారాష్ట్ర, అక్కడి పట్టణాలు అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో విలీనమై ఉండేవి. అప్పట్లో హైదరాబాద్ రాష్ట్రంలో 17 జిల్లాలు ఉండేవి. ప్రస్తుత తెలంగాణలోని హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, ఆదిలాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, కర్ణాటకలోని బీదర్, గుల్బర్గా, రాయచూర్, మహారాష్ట్రలోని బీడ్, పర్భణి, నాందేడ్, ఔరంగాబాద్, ఉస్మానాబాద్ జిల్లాలు ఉండేవి.కేంద్రంగా.. అప్పట్లో నిజాం పాలనలో ఈ ప్రాంతం కొనసాగింది. హైదరాబాద్, వికారాబాద్, జహీరాబాద్, బీదర్ మీదుగా పర్లి వరకు రైలు సదుపాయం కల్పించారు. హైదరాబాద్ నుంచి ఈ ప్రాంతం మీదుగా నల్‌దుర్గ్ వరకు 180 కి.మీ. మెటల్ దారి ఉండగా.. 1972లో రెండు వరుసలకు విస్తరించి తారురోడ్డుగా మార్చారు. ఆ తర్వాత ఇదే రహదారి 65వ నంబరు జాతీయ రహదారిగా రూపాంతరం చెందింది. ఈ ప్రాంతంలో డిపో ఏర్పాటుచేసి బస్సు సర్వీసులను వివిధ ప్రాంతాలకు నడిపించారు. కొంతకాలం జహీరాబాద్ బీదర్ జిల్లా పరిధిలోనూ కొనసాగింది. ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలువగా.. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతోంది. 2008లో జహీరాబాద్ కేంద్రంగా లోక్‌సభ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం.

# ఖర్చు మించితే.. అనర్హతే

చేగుంట : ఎన్నికలంటేనే ఖర్చుతో కూడుకున్నది. అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకొని విజయం సాధించేందుకు శ్రమిస్తుంటారు. ఈ క్రమంలో ఎన్నికల సంఘం సూచించిన దాని కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా వెచ్చిస్తుంటారు. వ్యయ పరిమితి పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ఖర్చు, తదితర అంశాలపై కథనం. గత శాసనసభ ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి అనధికారికంగా సుమారు రూ.50 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు ప్రచారం జరిగింది. ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో వివిధ పార్టీలు అభ్యర్థులను ప్రకటించగా.. నామినేషన్ ప్రక్రియ సైతం చివరి దశకు చేరింది. ప్రచారాలు ఊపందుకున్నాయి. దీంతో ఖర్చులు సైతం ప్రారంభమయ్యాయి. సభలు, ర్యాలీలు, భోజనాలు, వాహనాలు తదితర వాటికి వెచ్చించక తప్పదు. ఇలాంటి పరిస్థితుల్లో అభ్యర్థులు హద్దులు దాటకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను నిర్దేశించింది. వీటిని పక్కాగా అమలు చేసేలా ప్రత్యేక తనిఖీ బృందాలను సైతం నియమించింది. వీరు నిత్యం పరిశీలిస్తూ ఖర్చు లెక్కిస్తారు. హద్దు దాటితే అనర్హత పడే అవకాశం లేకపోలేదు.

రూ.95 లక్షల పరిమితి..

లోక్‌సభ అభ్యర్థుల వ్యయ పరిమితి రూ. 95 లక్షలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. అభ్యర్థులు ప్రచారం నిమిత్తం ఇంత కంటే ఎక్కువ ఖర్చు చేయకూడదు. పరిమితి దాటి ఖర్చు చేసినా, వాటికి సంబంధించిన లెక్కలను సరైన ఆధారాలతో సమర్పించకున్నా వేటు



పడక తప్పదు. నామపత్రాలు దాఖలు చేసినప్పటి నుంచి ఖర్చు లెక్కిస్తారు. అభ్యర్థి ఏదైనా జాతీయ బ్యాంకులో కొత్త ఖాతా తెరిచి లావాదేవీలు నిర్వహించాలి. నామినేషన్‌కు ముందు అభ్యర్థులు చేపట్టిన ప్రచారాలు, సభలు, ఇతర కార్యక్రమాల ఖర్చులను సంబంధిత పార్టీ ఖర్చు కింద జమచేస్తారు.

ఎన్నికల్లో ప్రలోభాల నియంత్రణకు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు స్టాటిక్ సర్వైలెన్స్, వీడి సర్వైలెన్స్, వీడియో వీవింగ్, ఎంసీసీ బృందాలను నియమించారు. ఆయా బృందాల సభ్యులు అన్నింటిపై నిఘా పెట్టారు. అభ్యర్థుల వెంట షాడో బృందాలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. సభలు, సమావేశాలు, ప్రచార కార్యక్రమాలను చిత్రీకరిస్తున్నారు. అభ్యర్థుల ఖర్చులను వ్యయ బృందాలు తనిఖీ చేసి ఏమైనా వ్యత్యాసాలు ఉంటే నోటీసులు జారీ చేస్తాయి.

30 రోజుల్లోగా సమర్పించాలి..

ఎన్నికల ఫలితాలు వెల్లడించిన తేదీ నుంచి 30 రోజుల్లోపు పోటీ చేసిన ప్రతి ఒక్కరూ తమ ఖర్చు వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలి. పరిమితికి మించి ఖర్చు చేసినా వ్యయానికి సంబంధించిన లెక్కలను నిర్దేశించిన సమయంలో చూపకున్నా వేటు పడటం ఖాయం. తర్వాతి ఎన్నికల్లో పోటీ చేసే హక్కు కోల్పోవాల్సి వస్తుంది. అందుకే అభ్యర్థులు జాగ్రత్తగా ఖర్చు చేస్తూ వివరాలను సమర్పించాల్సిందే.

# విధి నిర్వహణ చోటే ఓటేయొచ్చు

కొత్తగూడెం: ఎన్నికల క్రతువులో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవటం అత్యంత కీలకం. ఇందుకోసం ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించటానికి ఎన్నికల సంఘం(ఈసీ) అనేక కార్యక్రమాలు చేపడుతోంది. పోలింగ్ విధులు నిర్వర్తించే సిబ్బంది సైతం ఓటేసేలా చర్యలు తీసుకుంటోంది. ఒక లోక్‌సభ స్థానంలో ఓటుహక్కు కలిగి ఉండి మరో స్థానంలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న వారికి ఫాం-12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించటానికి దరఖాస్తులు స్వీకరించింది. పోలింగ్ విధులు నిర్వర్తించే చోట లేదా ఓటుహక్కు కలిగిన ప్రాంతంలో ఎక్కడైనా ఓటేసే వెసులుబాటు ఇవ్వనుంది. అదే లోక్‌సభ స్థానంలో ఓటుహక్కు కలిగినవారు దాని పరిధిలోని ఏ పోలింగ్ కేంద్రంలోనైనా ఓటేయటానికి అధికారులు ఈడీసీ(ఎలెక్షన్ డ్యూటీ సర్టిఫికెట్) ద్వారా అవకాశం కల్పిస్తున్నారు.


ఎవరెవరికి అవకాశం..ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ఓటుహక్కు కలిగిన లోక్‌సభ స్థానంలోని ఏ పోలింగ్ కేంద్రంలోనైనా ఈడీసీ ద్వారా ఓటేయొచ్చు. సదరు సిబ్బంది ఓటుహక్కు కలిగిన లోక్‌సభ స్థానంలో విధులు నిర్వర్తించాల్సి వస్తేనే ఈడీసీని అధికారులు జారీ చేస్తారు. ఉదాహరణకు కొత్తగూడెం పట్టణంలో ఓటుహక్కు ఉన్న ఉద్యోగి.. ఎన్నికల్లో భాగంగా పాలేరులో పోలింగ్ విధులు నిర్వర్తించాల్సి వస్తే సదరు వ్యక్తి ఈడీసీ ద్వారా అక్కడ ఓటేయొచ్చు. కొత్తగూడెం, పాలేరు శాసనసభ నియోజకవర్గాలు ఖమ్మం లోక్‌సభ స్థానం పరిధిలోకే వస్తాయి. అదే ఉద్యోగి భద్రాచలంలో విధులు నిర్వర్తించాల్సి వస్తే అక్కడి పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకోవటానికి అవకాశం ఉండదు. భద్రాచలం శాసనసభ నియోజకవర్గం మహబూబాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోకి రావటమే దీనికి కారణం. అప్పుడు ఆ ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసే అవకాశం ఉంటుంది.

సహాయక సిబ్బందికి సైతం..ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారు లు, ఇతర పోలింగ్ అధికారులతో పాటు సూక్ష్మ పరిశీలకులు, వీడియో గ్రాఫర్లు, డ్రైవర్లు ఇలా అనేక మంది ఎన్నికల విధులు నిర్వర్తిస్తుంటారు. వీరందరూ ఈడీసీ లేదా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగిం చుకునేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. పోలింగ్ రోజు రాత్రి వరకు విధులు నిర్వర్తించే సిబ్బంది మరుసటి రోజు వేతనంతో కూడిన సెలవు పొందటానికి ఈడీసీ అవసరమవుతుంది.

ఫాం-12(ఏ) ద్వారా దరఖాస్తు

ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది తాము పనిచేస్తున్న లోక్‌సభ స్థానంలోనే ఓటుహక్కు కలిగి ఉన్నట్లయితే వారు ఆ స్థానం పరిధిలోని ఏ పోలింగ్ కేంద్రంలోనైనా ఓటేసే అవకాశం కల్పించేదే ఈడీసీ. దీనిద్వారా ఓటుహక్కు వినియోగించుకునేవారు ఫాం-12(ఏ)ను తప్పులు లేకుండా పూరించి, ఎన్నికల విధుల వివరాలను జతపరిచి సంబంధిత సహాయక రిటర్నింగ్ అధికారి(ఏఆర్‌ఓ)కి అందించాలి. ఏఆర్‌ఓ పరిశీలించి రిటర్నింగ్ అధికారికి పంపిస్తారు. అన్ని అంశాలు సరిగ్గా ఉన్నాయని ధ్రువీకరించుకున్నాక సదరు రిటర్నింగ్ అధికారి ఈడీసీ జారీచేస్తారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సుమారు 20వేల మంది ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారు. వీరిలో సుమారు 80 శాతం మంది ఈడీసీ ద్వారా ఓటేసే అవకాశము ందని అధికారులు భావిస్తున్నారు.

# బీఆర్ఎస్‌కు భారీ షాక్.. కాంగ్రెస్ గూటికి కోనేరు బ్రదర్స్



భద్రాద్రి కొత్తగూడెం: లోక్‌సభ ఎన్నికల ముందు బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ భారీ ఓటమిని చవిచూసిన విషయం తెలిసిందే. ఆ పార్టీ ఎన్నికల్లో ఓడిపోవడంతో కీలక నేతలంతా వరుసగా రాజీనామాలు చేస్తున్నారు. ఆ పార్టీ కీలక నేతలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఇదే కోవలో కొత్తగూడెం బీఆర్ఎస్ సీనియర్ నేత కోనేరు చిన్ని కూడా శనివారం నాడు గులాబీ పార్టీకి రాజీనామా చేశారు. కోనేరు చిన్నితో పాటు ఆయన బ్రదర్ కోనేరు పూర్ణ చందర్‌రావు కూడా గులాబీ పార్టీకి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కోనేరు బ్రదర్స్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ నేతలకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి రేవంత్ సాదరంగా ఆహ్వానించారు. మాజీ మంత్రి కోనేరు నాగేశ్వరరావు వారసుడిగా కోనేరు చిన్ని రాజకీయాల్లోకి వచ్చి ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. తెలుగుదేశం పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా.. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కోనేరు చిన్ని పనిచేసిన విషయం తెలిసిందే. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో కోనేరు చిన్ని చేరారు. అయితే బీఆర్ఎస్‌లో చేరే ముందు కీలక పదవులు ఇస్తానని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చారు. కానీ ఎలాంటి పదవులు ఇవ్వకపోవడంతో గులాబీ పార్టీపై కోనేరు చిన్ని తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీంతో ఆ పార్టీని కోనేరు బ్రదర్స్ వీడారు. బీఆర్ఎస్ పెద్దల వైఖరి నచ్చక కాంగ్రెస్‌లో చేరినట్లు కోనేరు బ్రదర్స్ తెలిపారు.

**కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు :** వీరితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం మధ్యాహ్నం సుమారు 100మంది నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ వచ్చిందని.. తమ జిల్లాను సైతం సంపూర్ణంగా అభివృద్ధి చేస్తుందన్న నమ్మకంతోనే తాము ఈ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుంటామని చెప్పారు

# హీటెక్కుతున్న తెలంగాణం.. రేవంత్‌కు మరో సవాల్ విసిరిన హరీశ్ రావు



సిద్దిపేట: ఓ వైపు భానుడు సెగలు కక్కుతున్న వేళ.. అదే స్థాయిలో రాష్ట్రంలో పొలిటికల్ వేడి రాజుకుంటోంది. ఈ మధ్యే మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, సీఎం రేవంత్ రెడ్డి మధ్య సవాళ్లు చూశాం. ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేయకపోతే తాను రాజీనామా చేస్తానని హరీశ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఆయన శుక్రవారం తన రాజీనామా లేఖతో గన్ పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్దకు వచ్చారు. తాజాగా హరీశ్ మరో సవాలు విసిరారు. బీఆర్ఎస్ పార్టీ 24 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హరీశ్ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులో జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా లేఖను తాను సిద్ధం చేస్తానని, సీఎం రేవంత్ కూడా రాజీనామా లేఖతో రెడీగా ఉండాలని.. వాటిని ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి పంపిద్దామని అన్నారు. ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీతోపాటు కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేస్తే తన రాజీనామా ఆమోదం పొందుతుందని, హామీలు అమలు కాకపోతే రేవంత్ రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. రాజీనామాలు బీఆర్ఎస్‌కు కొత్త కాదని, పదవుల్ని గడ్డి పోచల్లా విసిరేసిన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందన్నారు. “బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేదే కాదు. 2002 ఏప్రిల్ 27న హైదరాబాద్ జలదృశంలో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమం నేడు దేశానికి ఆదర్శం అయింది. బీఆర్ఎస్ పథకాలను కేంద్ర ప్రభుత్వం కూడా అమలు చేసింది. రైతు బంధు పథకాన్ని బీజేపీ కాపీ కొట్టి అమలు చేసింది. కేసీఆర్ అభివృద్ధిలో ఆదర్శంగా నిలిస్తే.. సీఎం రేవంత్ రెడ్డి తిట్లలో ఆదర్శంగా నిలుస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలంగాణ కోసం రాజీనామా చేయమంటే దాక్కున్నారు. రాజీనామా చేయమంటే జిరాక్స్ పేపరు ఇచ్చి తిరిగిన వ్యక్తి రేవంత్ రెడ్డి. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తే నేను రాజీనామాకు సిద్ధంగా ఉన్నా. నాకు పదవులు ముఖ్యం కాదు ప్రజల ప్రయోజనాలే ముఖ్యం. ఆగస్టు 15 లోగా రుణమాఫీ, గ్యారెంటీలు అమలు చేస్తారో లేదో రేవంత్ చెప్పాలి. హామీల అమలుపై ప్రజలు ప్రశ్నిస్తే మంత్రులు తిడుతున్నారు. మీ తిట్లను ప్రజలు గమనిస్తున్నారు. ప్రతిపక్ష నేతగా నేను నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటా. సిద్దిపేట జిల్లాను తొలగిస్తానని రేవంత్ అంటున్నారు. జిల్లాను ఓ సారి తొలగించి చూడు. ప్రజలు స్పందన ఎలా ఉంటుందో. జిల్లాలు తొలగిస్తామంటున్న కాంగ్రెస్‌కు లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలి. హామీలు నెరవేరాలంటే కాంగ్రెస్ ఓడాల్సిందే” అని హరీశ్ అన్నారు.

# మాధవీలత స్ట్రాంగ్ ఉమెన్.. ఇన్‌స్టాలో పోస్టు చేసిన రేణుదేశాయ్



హైదరాబాద్ సిటీ: హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత కొంపెల్ల స్ట్రాంగ్ వుమెన్ అని నటి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాజీ భార్య రేణుదేశాయ్ తన ఇన్‌స్ట్రాగ్రామ్‌లో పేర్కొంది. ఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మాధవీలత ఫొటోను షేర్ చేస్తూ చాలా రోజుల తర్వాత బలమైన మహిళలను చూశారని ఆమె కోట్‌చేశారు. ఈ పోస్టు పెట్టడానికి తాను ఎవరి దగ్గర ప్యాకేజీ తీసుకోలేదని కూడా పేర్కొన్నారు. ‘నాకు అనిపించిన భావనను అందరికీ చెప్పాలని భావించాను’ అని ఆమె పోస్టు పెట్టారు.

# కిషన్‌రెడ్డి స్క్రిప్ట్ లీడర్... హిందూ సాంప్రదాయం గురించి తెలియదు: జగ్గారెడ్డి

హైదరాబాద్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్క్రిప్ట్ లీడర్ అని.. ఆయనకు హిందూ సాంప్రదాయం గురించి ఏమాత్రం తెలియదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్రాల అధ్యక్షులు అందరూ దమ్మిలేనని విమర్శించారు. ఎల్కే అద్వానీ భిక్షతోనే నరేంద్ర మోదీ ప్రధాని అయ్యారని చెప్పారు. శనివారం గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ... సోనియాగాంధీ, రాహుల్ గాంధీ కుటుంబం దేశ ప్రజల కుటుంబమని తెలిపారు. ఉపాధి హామీ పథకం అంటే గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అక్షయ పాత్ర లాంటిదని చెప్పుకొచ్చారు. గ్రామీణ అభివృద్ధి కోసం యూపీఏ చైర్మన్ సోనియా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్డమైన కండిషన్లు పెట్టి ఈ పథకాన్ని రద్దు చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. మోదీ నిరుపేదలకు శాపంగా మారారని మండిపడ్డారు. దివంగత ప్రధానమంత్రి పీవీ నర్సింహారావుని ప్రధానిని చేసింది సోనియాగాంధీనే అని తెలిపారు. సోనియాగాంధీ 22 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా ఉన్నారని వివరించారు. ప్రధాని కావాలనుకుంటే రెండు సార్లు అయ్యేవారని ఉద్ఘాటించారు. సోనియాగాంధ ని విమర్శించే నైతిక హక్కు బీజేపీ నాయకులకు లేదన్నారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్ ఓడిపోయామన్న ఫ్రస్టేషన్‌లో ఉన్నారన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలను పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరూ పట్టిచుకోరన్నారు. కాంగ్రెస్ లో స్వేచ్ఛ ఉందన్నారు. బీఆర్ఎస్ బీజేపీలోని నేతలకు స్వేచ్ఛ లేదని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194



# కాంగ్రెస్‌కు మద్దతిచ్చేందుకు సీపీఎం నేతలు అంగీకరించారు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డితో సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి, సీతారాములు, వీరయ్య భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీకి మద్దతివ్వాలని సీపీఎం నేతలను ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. భువనగిరితో పాటు ఇతర స్థానాల్లో మద్దతు కోరినట్లు చెప్పారు. మరికొన్ని రాజకీయ ప్రతిపాదనలు వారి ముందు ఉంచినట్లు తెలిపారు. కాంగ్రెస్‌కు మద్దతిచ్చేందుకు సీపీఎం నేతలు అంగీకరించారన్నారు. దేశంలో ఇండియా కూటమితో కలిసి పని చేయనున్నారని వివరించారు. ఒకట్రెండు విషయాల్లో సీపీఎంతో సందిగ్ధత ఉందని పేర్కొన్నారు. అధిష్ఠానంతో చర్చించి ఆదివారంలోగా ఏకాభిప్రాయానికి వస్తామన్నారు. ఆ పార్టీ సహకారంతో భవిష్యత్తులో ముందుకెళ్తామని చెప్పారు. తమ అభ్యర్థులు బరిలో నుంచి తప్పుకోవాలని సీఎం కోరారని తమ్మినేని వీరభద్రం అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడానికి సిద్ధమని తెలిపారు. భాజపా, ఇతర శక్తులను అడ్డుకునేందుకు మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు.

# శభాష్.. నీ ధైర్యం స్ఫూర్తినింపింది.. బాలుడిపై ప్రశంసలు కురిపించిన రేవంత్



హైదరాబాద్: హైదరాబాద్ శివారులోని ఓ పరిశ్రమలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ప్రమాదంలో 50 మంది కార్మికులు చిక్కుకుపోయారు. అందులో అత్యంత ప్రమాదకర పరిస్థితిలో ఉన్న ఐదుగురి ప్రాణాలు కాపాడటానికి 16 ఏళ్ల బాలుడు సాయిచరణ్ సాహసం చేశాడు. బాలుడి సాహసాన్ని సీఎం రేవంత్ రెడ్డి మెచ్చుకున్నారు. బాలుడి తెగింపు, ప్రదర్శించిన ధైర్య సాహసాలు యువకులకు స్ఫూర్తిగా నిలుస్తాయని సీఎం కొనియాడారు.

**ఘటన జరిగిందిలా..** రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలోని స్థానిక అలెన్ హెూమియో, హెర్బల్ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో కొద్దిరోజులుగా మరమ్మతులు జరుగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం వెల్డింగ్ పని చేస్తుండగా నిప్పురవ్వలు ఎగిశాయి. హెూమియో ఔషధాల తయారీకి వినియోగించే ఆల్కహాల్, ఇతర రసాయనాలు అప్పటికే అక్కడ పడి ఉండడంతో.. ఆ నిప్పురవ్వలు పడగానే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు శరవేగంగా వ్యాపించి అక్కడే ఉన్న 15 ఆల్కహాల్ బ్యారెళ్లకు అంటుకోవడంతో మంటల తీవ్రత పెరిగింది. ఆ సమయంలో పరిశ్రమలో పనిచేస్తున్న 50 మందిలో అత్యధికులు వెనకభాగంలో ఉన్న మెట్లపైనుంచి సురక్షితంగా కిందికి చేరుకున్నారు. నాలుగో అంతస్తులో ఉన్న ఆరుగురు వ్యక్తులు కిందికి రావడానికి ఇబ్బంది పడ్డారు. వారిలో కేఎల్ఎన్ చారి అనే ఉద్యోగి.. ప్రాణాలు కాపాడుకోవడానికి అంత ఎత్తు నుంచి కిందికి దూకేయడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. మిగతా ఐదుగురినీ సాయిచరణ్ అనే బాలుడు కాపాడాడు. తన స్నేహితుడి తల్లి అదే కంపెనీలో పనిచేస్తుండడంతో.. అగ్నిప్రమాద వార్త తెలియగానే అతడు పరుగుపరుగున అక్కడికి చేరుకున్నాడు. నాలుగో అంతస్తులో కొందరు చిక్కుకుపోయిన విషయం తెలుసుకుని పరిశ్రమ గేటు దూకి, తాడు సాయంతో నాలుగో అంతస్తులోకి చేరుకుని అదే తాడుతో ఇద్దర్ని సురక్షితంగా కిందికి దించాడు. అంతలో అగ్నిమాపక శకటం వచ్చింది. వెంటనే అతడు తాడుతో కిందికి దిగి.. ఫైరింజన్‌కు ఉన్న భారీ నిచ్చెనను నాలుగో అంతస్తు వరకూ చేరవేశాడు. అక్కడ ఉన్న మిగతా ముగ్గురూ కిందికి దిగడానికి సాయపడ్డాడు. అతడు చూపిన ధైర్యసాహసాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డీసీపీ నారాయణరెడ్డి అభినందించారు. ఎమ్మెల్యే శంకర్ రూ.5వేలు రివార్డుగా ఇవ్వగా.. తీసుకోవడానికి బాలుడు నిరాకరించాడు. తనకు చేతనైన సాయం చేశానని, డబ్బు వద్దని చెప్పడంతో.. ఎమ్మెల్యేతో సహా అక్కడ ఉన్నవారంతా సాయిచరణ్‌ను ఎంతగానో కొనియాడారు. కాగా.. అగ్నిప్రమాదంలో రూ.12 కోట్ల ఆస్తినష్టం వాటిల్లిందని పరిశ్రమ యాజమాన్యం తెలిపింది. సీఎం మెచ్చుకోవడంతో బాలుడి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

# కాంగ్రెస్ అలా నిరూపిస్తే పోటీ నుంచి వైదొలుగుతా.. : బండి సంజయ్



కరీంనగర్: ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ మోసగించిందని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారని గుర్తుచేశారు. తమ మేనిఫెస్టో ఖురాన్, బైబిల్, భగవద్గీత అని చెప్పారన్నారు. గతంలో హామీలు నిలబెట్టుకోనందుకే భారాసను ప్రజలు బొందపెట్టారని దుయ్యబట్టారు. “మహిళల ఖాతాల్లో రూ.2,500 జమ చేసినట్లు కాంగ్రెస్ ఆధారాలు చూపాలి.

ఆసరా పింఛన్లు రూ.4 వేలు, విద్యార్థులకు భరోసా కార్డులు ఇచ్చినట్లు చూపితే పోటీ నుంచి తప్పుకోవడానికి నేను సిద్ధం. నిరూపించలేకపోతే మీరందరూ పోటీ నుంచి వైదొలుగుతారా? ఎల్లుండి(సోమవారం) వరకు నిరూపిస్తే నామినేషన్ విత్ డ్రా చేసుకుంటా. లేదంటే 15 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ నుంచి విరమించుకుంటుందా?” అని బండి సంజయ్ సవాల్ విసిరారు.

# ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం.. తెలంగాణ ఉద్యమం దేశానికే ఆదర్శమన్న కేటీఆర్



హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ 24వ వార్షికోత్సవాన్ని పార్టీ శ్రేణులు తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో సాదాసీదాగా వేడుకలు నిర్వహించాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతలు, కార్యకర్తలకు ఇప్పటికే ఆదేశించారు. శనివారం ఉదయం 9 గంటలకు తెలంగాణ భవన్‌లో కేటీఆర్.. బీఆర్ఎస్ జెండా ఎగరవేసి.. నేతలు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. “ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగాలని ఉద్యమ నేత, రథసారథి కేసీఆర్ బీఆర్ఎస్‌ను స్థాపించారు. ఎన్నో ఏళ్ల పోరాటంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం లక్ష్యం నెరవేరింది. అధికార గర్వంతో ఉన్న ఆనాటి కాంగ్రెస్ సర్కార్ మెడలు వంచి రాష్ట్ర సాధన కోసం కృషి చేశాం. కుట్రలు ప్రలోభాలతో ఉద్యమాన్ని ఆపాలని కాంగ్రెస్ చూసింది. రాష్ట్రం సిద్ధించాక కేసీఆర్ నాయకత్వంలోనే అభివృద్ధి సాధ్యమైంది. 10 ఏళ్లల్లో బీఆర్ఎస్ సర్కార్ ఎన్నో సమస్యల్ని పరిష్కరించింది. ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ నిలిచిపోయింది. రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా పార్టీ విస్తరించింది. కానీ దురదృష్టవశాత్తూ 2023 ఎన్నికల్లో ఓటమి పాలయ్యాం. ఇప్పటికీ కేసీఆర్ మీద నమ్మకం ఉంది. కేసీఆరే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటోంది. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా మళ్లీ బంపర్ మెజారిటీతో అధికారంలోకి వస్తాం. ఉద్యమంలో కూడా మమ్మల్ని కించపరిచారు. మేమేనాడు కుంగిపోలేదు. ఇప్పుడూ అదే ధైర్యంతో ఉంటాం. బీఆర్ఎస్ జెండా మోసి కార్యకర్తలకు పాధాభివందనం. అమరవీరుల త్యాగం మరువలేనిది. వారి ఆకాంక్షల సాధనే ధ్యేయంగా బీఆర్ఎస్ ముందుకెళ్తుంది” అని కేటీరామారావు స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ వైఫల్యం వల్లే పాక్ అధీనంలోకి పీవోకే: భాజపా ఎంపీ లక్ష్మణ్



హైదరాబాద్: అంబేద్కర్ ఆశయాలను భాజపా ప్రభుత్వం నెరవేరుస్తోందని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.350 కోట్లతో స్ఫూర్తి, దీక్షా కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంబేద్కర్ చిత్రపటాన్ని పార్లమెంటులో ఏర్పాటు చేశామని, భారతరత్నతో గౌరవించినట్లు చెప్పారు. “కాంగ్రెస్ వైఫల్యం వల్లే పాక్ అధీనంలోకి పీవోకే వెళ్లింది. అయోధ్య నిర్మాణాన్ని కాంగ్రెస్ అడుగడుగునా అడ్డుకుంది. శ్రీరాముడిని అవమానించి హిందువుల మనోభావాలు దెబ్బతీశారు. అయోధ్య ప్రాణప్రతిష్ఠ వేళ రాహుల్‌గాంధీ హాజరు కాలేదు. సోమనాథ్ ఆలయ పునరుద్ధరణను ఆనాడు కాంగ్రెస్ వ్యతిరేకించింది. కొత్తగా సీఏఏపై తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఇస్లాం దేశాల్లో మైనార్టీలు తీవ్ర వివక్షకు గురవుతున్నారు. హిందువులు, జైనులు, క్రైస్తవులు మత హింసకు గురవుతున్నారు. శరణార్థులుగా భారత్‌కు వస్తామని వేడుకుంటున్నారు. వారికి పౌరసత్వం ఇస్తామంటే హస్తం పార్టీ వ్యతిరేకిస్తోంది. సీఏఏను మతంతో ముడిపెట్టి ఆరోపణలు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఆరోపిస్తున్నారు” అని లక్ష్మణ్ అన్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660